
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY



కరీంనగర్
జిల్లా వార్తలు
5
మంగళవారం 16 ఏప్రిల్ 2024

కాంగ్రెస్‌లో అంతర్గత విభేదాలు



డీసీసీ కార్యాలయంలో మంత్రి పొన్నం ప్రభాకర్ చేపట్టిన దీక్షలో వేదిక కింద కూర్చున్న కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి (ఫైల్)

- 'సుడా' చైర్మన్‌కు అవమానం అంటూ సోషల్‌మీడియాలో ఆడియో వైరల్
- మంత్రి 'పొన్నం' తీరుపై శ్రేణుల్లో అసంతృప్తి

కరీంనగర్ అర్బన్, ఏప్రిల్ 15: కాంగ్రెస్ పార్టీలో అంతర్గత విబేధాలు పార్టీ శ్రేణులను తీవ్ర కలవరానికి గురిచేస్తున్నాయి. పార్లమెంట్ ఎన్నికలకు సమయం దగ్గరపడుతున్నప్పటికీ కరీంనగర్ లోక్‌సభ అభ్యర్థి ఎవరో ప్రకటించక పోవడంతో అసంతృప్తికి గురవుతున్న నాయకులు, కార్యకర్తలు నేతల మధ్య ఆధిపత్యపోరుతో సోషల్ మీడియాలో తమ అసంతృప్తిని వెల్లడిస్తున్నారు. ఆదివారం రాష్ట్ర బీసీ సంక్షేమ, రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో కేంద్రంలోని బీజేపీ వైఫల్యాలు, విభజన హామీలపై చేపట్టిన దీక్ష పార్టీలోని నేతల మధ్య విబేధాలు మరింత భగ్గుమ న్నాయి. డీసీసీ కార్యాలయంలో చేపట్టిన దీక్షకు జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడితో పాటు నగర కాంగ్రెస్ అధ్యక్షుడు, సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డికి వేదికపై సముచిత స్థానం కల్పించకుండా కింద కూర్చోబెట్టడం, ఆయనను అవమానపరచడమే నంటూ యువజన కాంగ్రెస్ కరీంనగర్ అసెంబ్లీ అధ్యక్షుడు అబ్దుల్ రహమాన్ పోస్టు చేసిన ఆడియో సోషల్ మీడియాలో వైరల్ కావడం పార్టీలో చర్చనీయంశంగా మారింది. పార్లమెంట్ ఎన్నికలకు కేవలం 28 రోజుల ముందే జరిగిన ఈ సంఘటన పార్టీకి నష్టం కలిగిస్తుందని, మంత్రి పొన్నం ప్రభాకర్ వ్యవహరించిన తీరు సరిగాలేదంటూ కార్యకర్తలు బాహటంగా విమర్శించడం పార్టీలో ఆందోళన కలిగిస్తున్నది. ఈ ఆడియోను పలు సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ చేయగా కాంగ్రెస్‌పార్టీకి చెందిన, పలు ఇతర వాట్సప్ గ్రూపులలో వైరల్ అయింది. కాంగ్రెస్ పార్టీకి చెందిన గ్రూపులలో ఈ ఆడియోపై అటు మంత్రి అనుచరులు, ఇటు కోమటిరెడ్డి అనుచరుల మధ్య పోటాపోటీగా చాటింగ్ నడిచినట్లు సమా చారం. కాంగ్రెస్‌పార్టీ కష్టకాలంలో జెండా మోసిన నాయకుడిని అవమానించడం పద్ధతికాదని, ఇతర పార్టీల నాయకులను పార్టీలోకి తీసుకోవడంలో తప్పులేదుకాని, కష్టకాలంలో పార్టీ వెన్నంటి ఉన్న నాయకులకు సుముచిత గౌరవం ఇవ్వాలని, మళ్లీ ఇటువంటివి పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని అబ్దుల్ రహమాన్ తన ఆడియోలో పేర్కొన్నాడు. నగరంలో జరిగే అన్ని పార్టీ కార్యక్రమాలకు నగరశాఖ అధ్యక్షుడు అధ్యక్షత వహించాల్సి ఉండగా కనీసం వేదికపైకి ఆహ్వానించక పోవటం పట్ల నరేందర్‌రెడ్డి అనుచరులు నిరసన వ్యక్తం చేస్తున్నారు. దీక్ష కార్యక్రమానికి తన అనుచరులతో చేరుకున్న నరేందర్‌రెడ్డిని వేదికపైకి ఆహ్వానించకపోవటంతో ఆయన వేదికముందు అనుచర నాయకులు, కార్యకర్తలతో కలిసి రెండు గంటలు అలాగే కూర్చున్నాడు. నరేందర్‌రెడ్డి గత నెలలో సుడా చైర్మన్‌గా నియామకమైనప్పటి నుంచి మంత్రితో సయోధ్య లేదనే చర్చ నడుస్తోంది. మంత్రికి తెలియకుండా ఉమ్మడి జిల్లాకు చెందిన మంత్రి శ్రీధర్‌బాబు, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి సహకారంతోనే నరేందర్‌రెడ్డి పదవి తెచ్చుకున్నాడనే కారణంగానే ఆయనను పక్కన బెడుతున్నారనే విమర్శలు వస్తున్నాయి. సుడా చైర్మన్‌గా నియామకమైన తరువాత నరేందర్‌రెడ్డి మంత్రిని మర్యాదపూర్వకంగా కలిసేందుకు వెళ్లిన సమయంలో కూడా కనీసం కూర్చోమనకుండా, మాట్లా డకుండా అవమానపరిచాడని ఆయన అనుచ రులు రుసరుసలాడుతున్నారు. అప్పటి నుంచి మంత్రికి దూరదూరంగానే ఉంటున్న నరేందర్‌రెడ్డి కరీంనగర్‌లో దీక్షకు హాజరుకాగా ఈ ఘటన చోటు చేసుకోవటంతో ఇప్పటి వరకు పార్టీలోలోపల ఉన్న గ్రూపుల వివాదం బయట సామాజిక మాధ్యమాలకు పొక్కింది. నరేందర్‌రెడ్డికి అవమానం జరిగిందంటూ అబ్దుల్ రహమాన్ ఆడియోపై నరేందర్‌రెడ్డి సామా జికవర్గంలో కూడా తీవ్ర చర్చకు దారితీసింది. ఈ చర్యతో రాబోవు పార్లమెంట్ ఎన్నికల వేళ ఆ సామాజికవర్గం ప్రభా వాన్ని చూపే అవకాశాలు లేకపోలేదని భావిస్తున్నారు.

ఇల్లందకుంటలో ఘనంగా బ్రహ్మోత్సవాలు

- బాహ్య మందిర ప్రవేశం చేసిన స్వామివారు



తలంబ్రాలు కలుపుతున్న మహిళలు, పల్లెకిలో స్వామివారు

ఇల్లందకుంట, ఏప్రిల్ 15: శ్రీసీతారామచంద్రస్వామి దేవాలయంలో బ్రహ్మోత్సవాలు ఘనంగా సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా స్వామివారి ఉత్సవమూర్తులను గ్రామ దేవాలయం నుంచి ప్రధా న ఆలయానికి పల్లకిలో తోలుకవచ్చారు. ఈ సందర్భంగా ఉదయం ప్రత్యేక పూజలు చేసిన అనంతరం స్వామివారి ఉత్సవమూర్తులను ప్రత్యే కంగా అలంకరించి పల్లెకిలో అసీనులను చేసి భాజాబజంత్రీలు, మేళా తాళాల మధ్య తీసుకువచ్చారు. కార్యక్రమంలో ఆలయ ఈవో కందుల సుధాకర్, భక్తులు పాల్గొన్నారు. అదే విధంగా శ్రీరామనవమి సందర్భంగా స్వామివారికి గోటితో ఒలిసిన తలం బ్రాలను, చీరను వేములవాడకు చెందిన శ్రీరాజరాజేశ్వరిదేవి సేవా సమితి వారు స్వామివారికి సమర్పించారు. అదే విధంగా గ్రామ మహిళలు భక్తులచే స్వామివారికి తలంబ్రాల బియ్యం కలిపారు.

● దేవాలయంలో ఏర్పాట్లపై సమీక్ష

ఇల్లందకుంట: మండల కేంద్రంలోని శ్రీసీతారామచంద్రస్వామి దేవాలయంలో ఈ నెల 15నుంచి 27వరకు జరిగే వార్షిక బ్రహ్మోత్సవాలను అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి విజయవంతం చేయాలని హుజూరాబాద్ ఆర్డీవో రమేష్‌బాబు అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో ఏసీపీ శ్రీనివాస్‌జీతో కలిసి అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ ఉత్సవాలకు భక్తులు అధిక సంఖ్యలో రానున్న నేపథ్యంలో వారికి ఎలాంటి అసౌకర్యం కలుగకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఈవో కందుల సుధాకర్, ఎంపీడీవో పుల్లయ్య, డిప్యూటీ డీఎంహెచ్‌వో చందు, సీఐ కిశోర్, ఎస్‌ఐలు రాజకుమార్, తోట తిరుపతి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయంలో జాతర ఏర్పాట్లను ఏసీపీ శ్రీనివాస్‌జీ పరిశీలించారు.

శృంగేరీ పీఠాధిపతిని దర్శించుకున్న బండి సంజయ్



శృంగేరిలో విధుశేఖర భారతీ తీర్థ మహాస్వామి నుంచి ఆశీస్సులు పొందుతున్న ఎంపి బండి సంజయ్‌కుమార్

కరీంనగర్ కల్చరల్, ఏప్రిల్ 15: శృంగేరీ శారదా పీఠంలో జరుగుతున్న పూర్వ పీఠాధిపతి భారతీ తీర్థ స్వామి 74వ వర్ధంతి కార్యక్రమాల సంద ర్భంగా సోమవారం ప్రస్తుత పీఠా ధిపతి విధు శేఖర భారతీ తీర్థ మహాస్వామిని ఎంపి, బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్ కుమార్ దర్శించుకున్నారు. ఈ సంద ర్భంగా స్వామీజీ ధర్మ రక్షణ కోసం బండి సంజయ్ చేస్తున్న పోరాటాలను అభినందించారు. ధర్మాన్ని వీడొద్దని, ధర్మ పరిరక్షణను కొనసా గించాలని, గో సంరక్షణ కోసం సమాజాన్ని సంఘటితం చేయాలని స్వామీజీ ఆశీస్సులందించినట్లు వారు తెలిపారు. స్వామీజీని దర్శించుకున్న వారిలో బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ ఎస్వీఎస్ఎస్ ప్రభాకర్ ఉన్నారు.

23న వీర హనుమాన్ విజయయాత్ర

సుభాష్‌నగర్, ఏప్రిల్ 15: చిన్న హనుమాన్ జయంతిని పురస్కరించుకొని ఈ నెల 23న వీరహనుమాన్ విజయ యాత్రను నిర్వహిస్తున్నట్లు విశ్వహిందూ పరిషత్ జిల్లా కార్యదర్శి విద్యాసాగర్, బజరంగ్‌దళ్ కో కన్వీనర్ కన్నం శంకర్ తెలిపారు. సోమవారం నగరంలోని ప్రెస్‌భవన్‌లో విజయయాత్ర పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చైత్ర శుద్ధ పౌర్ణమి రోజున హనుమంతుడు లంకను జయించిన సందర్భంగా, హిందూ సమాజాన్ని జాగృతం చేయడం కోసం విశ్వహిందూ పరిషత్, బజరంగ్ దళ్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గాంధీ రోడ్డులోగల రామాలయం నుంచి బైక్ ర్యాలీ బయలుదేరుతుందని తెలిపారు. దేశ ధర్మరక్షణ కోసం హిందువులందరూ ర్యాలీలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో విహెచ్‌పీ కోశాధికారి ఆంజనేయులు, జిల్లా సహ కార్యదర్శి శ్రీనివాస్, బజరంగ్ దళ్ సురక్ష ప్రముఖ్ అడ్డకట్ల శ్రీనివాస్, నగర కన్వీనర్ గుజ్జెంటి రాజేందర్, శ్రీనివాస్, రంజిత్, నీలకంఠం, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న వీహెచ్‌పి, భజరంగ్‌ధళ్ బాధ్యులు

ఏసీబీకి చిక్కిన ఆర్టీసీ డిపో మేనేజర్

డ్రైవర్ నుంచి రూ. 20వేల లంచం తీసుకుంటుండగా పట్టివేత

హుజూరాబాద్, ఏప్రిల్ 15: ఓ ఆర్టీసీ డ్రైవర్ నుంచి రూ. 20వేలు లంచం తీసుకుంటూ సోమవారం హుజూరాబాద్ డిపో మేనేజర్ సామల శ్రీకాంత్ ఏసీబీ అధికారులకు చిక్కారు. హనుమ కొండ జిల్లా ఎల్కతుర్తి మండలం దండెపల్లి గ్రామానికి చెందిన తాటికొండ రవీందర్ అనే ఆర్టీసీ డ్రైవర్ హుజూరాబాద్ డిపోలో పనిచేస్తున్నాడు. ఫిబ్రవరి 13న దగ్గరి బంధువులు చనిపోతే విధులకు హాజరు కాలేదు. తిరిగి 16న విధులకు రాగా, డిపో మేనేజర్ శ్రీకాంత్ అనుమతి లేకుండా మూడు రోజులు గైర్హాజరైనందున చార్జి మెమో అందజేశారు. ఈ విషయంపై తాటికొండ రవీందర్ డిపో మేనేజర్ శ్రీకాంత్‌ను కలువగా, చార్జి మెమోను ఎత్తేయడానికి రూ. 30వేలు లంచం డిమాండ్ చేశారు. మెదటి విడతలో 15రోజుల క్రితం రూ. 10వేలు రవీందర్ హనుమ కొండలోని డిపో మేనేజర్ సొంత ఇంట్లో అందజేశాడు. మిగతా డబ్బుల కోసం ఇటీవల డిపో మేనేజర్ శ్రీకాంత్ రవీందర్‌ను మళ్లీ డబ్బులు అడగగా విసుకు చెందిన ఆయన వరంగల్ ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. మిగతా డబ్బులు ఇస్తానని డిపో మేనేజర్‌కు ఎల్కతుర్తికి రావాలని రవీందర్ ఫోన్ చేశాడు. దీంతో కారులో డిపో మేనేజర్ ఎల్కతుర్తిలోని ఓ హోటల్‌కు వచ్చారు. రూ. 20వేలు లంచం తీసుకుంటుండగా డిపో మేనేజర్ శ్రీకాంత్‌ను పట్టుకున్నట్లు ఏసీబీ డీఎస్పీ సాంబయ్య, సీఐలు రాజు, శ్యాంసుందర్ తెలిపారు. డిపో మేనేజర్ శ్రీకాంత్‌పై కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరుస్తామన్నారు. ఈ విషయం తెలుసుకున్న జిల్లా రిజినల్ డిప్యూటీ మేనేజర్ సురికంటి భూపతిరెడ్డి, ఆర్టీసీ సిబ్బందితో డిపో కార్యాలయానికి చేరుకున్నారు. ఏసీబీ అధికారుల నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు.



ఎల్కతుర్తిలోని ఏసీబీ అధికారులకు పట్టుబడిన డిపో మేనేజర్ శ్రీకాంత్

● హుజూరాబాద్ డిపోలో ఏసీబీ అధికారుల విచారణ

ఎల్కతుర్తిలో రెడ్‌హ్యాండెండ్‌గా పట్టుబడిన డిపో మేనేజర్ శ్రీకాంత్‌ను హుజూరాబాద్ డిపో కార్యాల యానికి ఏసీబీ అధికారులు తీసుకొచ్చారు. కార్యాలయంలోని రికార్డులను పరిశీలించారు. కార్యాల యంలో పనిచేసే సిబ్బందిని విచారిం చారు. ఈ సందర్భంగా సిబ్బంది నుంచి డిపో మేనేజర్‌కు సంబంధించిన వివరాలను సేక రించారు.

● ఆర్టీసీ సిబ్బందికి మూడు నెలల్లో ముప్పు తిప్పలు

హుజూరాబాద్ డిపో మేనేజర్‌గా మూడు నెలల క్రితం శ్రీకాంత్ బాధ్యతలు స్వీకరించారు. అప్పటి నుంచి ఆర్టీసీ సిబ్బం దిని తరుచూ వేధించేవాడని కార్మికులు వాపోతున్నారు. విధు లకు ఆలస్యంగా వచ్చినా, అనారోగ్యంతో విధులకు రాకపో యినా చార్జి మెమోలు ఇచ్చేవారన్నారు. కొంత మంది ఎవరికీ చెప్పుకోలేక డిపో మేనే జర్‌కు డబ్బులు ఇచ్చినట్లు ఆరోపణలు వస్తు న్నాయి. జమ్మికుంటకు మండలానికి చెందిన ఓ ఆర్టీసీ ఉద్యోగి కూడా ఇదే విధంగా వేధించగా, రెండు రోజుల క్రితం ఏసీబీ అధికారులను ఆశ్రయించినట్లు సమాచారం. ఇంతలోనే వరంగల్ ఏసీబీ అధికారులు డీఎంను పట్టుకున్నారు.

ఓపెన్ స్కూల్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలి

- కలెక్టర్ పమేలా సత్పతి

కరీంనగర్ టౌన్, ఏప్రిల్ 15: జిల్లాలో ఏప్రిల్ 25 నుంచి మే 2వ తేదీ వరకు నిర్వహించనున్న ఓపెన్ స్కూల్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ పమేలా సత్పతి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఓపెన్ స్కూల్ పరీక్షల నిర్వహణపై వివిధ శాఖల అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. జిల్లా సందర్భంగా చేపట్టాల్సిన ఏర్పాట్లపై దిశా నిర్దేశం చేశారు. పరీక్ష కేంద్రాల్లోకి సెల్‌ఫోన్‌లను ఎట్టి పరిస్థితిల్లోనూ అనుమతించవద్దని పేర్కొన్నారు. పరీక్ష రాసే వారితో పాటు ఇన్విజిలేటర్లు సెల్‌ఫోన్లను తీసుకెళ్లకుండా చూడాలన్నారు. నిబంధనలను అందరూ పాటించాలని పేర్కొన్నారు. పోలీసులు పకడ్బందీగా తనిఖీలు నిర్వహించాలని సూచించారు. ఓపెన్ స్కూల్ ఎస్‌ఎస్‌సికి సంబంధించిన పరీక్షా కేంద్రాలు కరీంనగర్‌లో రెండు, హుజూరాబాద్‌లో ఒకటి ఏర్పాటు చేస్తున్నామని అన్నారు. ఈ మూడు కేంద్రాల్లో 475 మంది పరీక్షలు రాయనున్నారని అన్నారు. ఇంటర్‌కు సంబంధించిన పరీక్ష కేంద్రాలు కరీంనగర్‌లో మూడు, హుజూరాబాద్‌లో రెండు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. 881 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతారని, పరీక్షలు సజావుగా జరిగేందుకు అన్ని చర్యలు చేపట్టాలని సూచించారు. పరీక్షా కేంద్రాలకు బస్ సౌకర్యం, విద్యుత్ సరఫరా, పోలీసు బందోబస్తు, తాగునీటి వసతి వంటి ఏర్పాట్లు చూడాలని, వైద్య సిబ్బంది అత్యవసర మందులతో అందుబాటులో ఉండేలా చూడాలని ఆయాశాఖల అధికారులను ఆదేశించారు. సీసీ కెమెరాల పర్యవేక్షణలో పరీక్షలు పకడ్బందీగా జరిగేలా చూడాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్ అజయ్‌యాదవ్, డీఆర్‌వో పవన్ కుమార్, జిల్లా విద్యాధికారి జనార్దన్‌రావు, జిల్లా వైద్యాధికారి డాక్టర్ సుజాత, డిఈసి మెంబర్ అశోక్‌రెడ్డి, స్పెషల్ బ్రాంచి ఎస్‌ఐ లక్ష్మారెడ్డి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

బీజేపీని ఓడించేందుకు కమ్యూనిస్టులు సిద్ధం కావాలి

భగత్‌నగర్, ఏప్రిల్ 15: దేశంలో మతతత్వ బీజేపీని ఓడించేందుకు కమ్యూనిస్టులు సిద్ధం కావాలని సీపీఐ, సీపీఎం జిల్లా కార్యదర్శులు మర్రి వెంకటస్వామి, మిల్కూరి వాసుదేవరెడ్డిలు పిలుపునిచ్చారు. సోమవారం నగరంలోని బద్దం ఎల్లారెడ్డి భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమా వేశంలో వారు మాట్లాడుతూ ప్రజలకు లేనిపోని హామీలిచ్చి బీజేపీ మూడవ సారి అధికారం చేపట్టాలని చూస్తుంద న్నారు. పది సంవత్సరాలుగా ఉద్యోగాలు కల్పించకుండా నిరు ద్యోగాన్ని పెంచి పోషించిందన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలన్నీ ప్రైవేట్ పరం చేసిన చరిత్ర బీజేపిదన్నారు. రైతు,కార్మిక వ్యతిరేక విధానాలు అవలంభిస్తూ రైతులపై తుటాలు పేల్చింద న్నారు. కరీంనగర్‌లో ఎంపిగా బండి సంజయ్ చేసిన అభివృద్ధి ఏమీ లేదన్నారు. ఈ నెల 20వ తేదీన వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో మతతత్వ బీజేపీని ఓడించేందుకు కార్యకర్తలకు దిశా నిర్దేశం చేసేం దుకు జిల్లా స్థాయి సదస్సు కరీంనగర్‌లో నిర్వహిస్తున్నామన్నారు. సమావే శంలో నగర కార్యదర్శులు కసిరెడ్డి సురేందర్‌రెడ్డి, గుడి కందుల సత్యం, పైడిపల్లి రాజు, పిట్టల సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన కల్పించాలి

- ఫైర్ సిబ్బంది కఠోర శ్రమతో ప్రజలకు రక్షణ
- కలెక్టర్ పమేలా సత్పతి



ఫైర్ సేఫ్టీ కిట్ల పనితీరును కలెక్టర్‌కు వివరిస్తున్న జిల్లా ఫైర్ ఆఫీసర్ వెంకన్న

కరీంనగర్ క్రైం, ఏప్రిల్ 15: అగ్ని ప్రమాదాల నివారణపై ప్రజలకు అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి పేర్కొన్నారు. సోమవారం కరీంనగర్‌లోని కాశ్మీర్‌గడ్డ ఫైర్‌స్టేషన్‌లో అగ్నిమాపక శాఖ వారోత్సవాల్లో భాగంగా ఏర్పాటు చేసిన ఫైర్ సేఫ్టీ కిట్ల ప్రదర్శనను కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వాటి పనితీరును స్వయంగా పర్యవేక్షించారు. జిల్లా ఫైర్ ఆఫీసర్ టి వెంకన్న వివిధ అంశాలను కలెక్టర్‌కు వివరించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా ఎన్‌సీసీ కెడెట్లు, ఎన్ఎస్ఎస్ విద్యార్థులు, స్వశక్తి మహిళలు, మున్సిపల్, విద్యుత్ సిబ్బంది, ప్రజలకు అగ్ని ప్రమాదాల నివారణపై విస్తృతంగా అవగాహన కల్పించాలని అన్నారు. ఫైర్ సిబ్బంది కఠోర శ్రమతో ప్రజలకు రక్షణ కల్పిస్తున్నా రన్నారు. ప్రజలకు అవగాహన కల్పిస్తే ఎక్కడైనా ప్రమాదం జరిగితే ఫైర్ సిబ్బంది చేరుకునేలోపే సహాయక చర్యలు చేపట్టే అవకాశం ఉంటుందని చెప్పారు. జిల్లా వ్యాప్తంగా వారోత్సవాలు ఘనంగా నిర్వహించాలని సూచించారు. ఫైర్ సిబ్బంది ఆపద సమయంలో అందిస్తున్న సేవలపై మీడియాకు సమాచారం ఇవ్వాలని సూచించారు. టీం వర్క్‌తోనే ప్రజల్లో మంచి గుర్తింపు వస్తుందని, అత్యుత్తమ సేవలందిస్తూ ముందుకెళ్లాలని అన్నారు. కరీం నగర్‌లో ప్రైవేట్ హాస్పిటల్స్, అపార్ట్‌మెంట్లు, కమర్షియల్ బిల్డింగ్స్‌లో ఫైర్ సేఫ్టీ కిట్ల పనితీరు తెలుసుకునేందుకు తనిఖీలు నిర్వహించాలని ఆదేశించారు. అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్ మాట్లాడుతూ ఫైర్ సేఫ్టీ నిబంధనలు పాటించని హాస్పిటల్స్, కమర్షియల్ బిల్డింగ్స్ నిర్వాహకులపై చర్యలు తీసుకుం టామని అన్నారు. అగ్నిమాపక సిబ్బందికి తమ సహాయ, సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయని తెలిపారు. సిబ్బంది అందిస్తున్న సేవలను జిల్లా కలెక్టర్‌కు ఫైర్ ఆఫీసర్ వివరించారు. కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్ అజయ్‌యాదవ్, జిల్లా ఫైర్ ఆఫీసర్ తగరం వెంకన్న, సీపీఓ కొమురయ్య, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ నాగార్జున, వయోజన విద్య డీడీ జయశంకర్, బీసీ డెవలప్‌మెంట్ ఆఫీసర్ అనిల్ ప్రకాశ్, ఎన్‌వైకే కోఆర్డినేటర్ వెంకట రాంబాబు, జిల్లా అసిస్టెంట్ ఫైర్ ఆఫీసర్ డి ప్రభాకర్, కరీంనగర్, మానకొండూర్ ఫైర్ ఆఫీసర్లు గుండయ్య, బి బూదయ్య ఫైర్ సిబ్బంది పాల్గొన్నారు.



ఫైర్ సేఫ్టీ కిట్ల ప్రదర్శనను ప్రారంభిస్తున్న కలెక్టర్

దొంగల బీభత్సం

ఎల్లారెడ్డిపేట, ఏప్రిల్ 15: ఎల్లారెడ్డిపేట మండలం పదిర, అల్మాస్‌పూర్ గ్రామాల్లో ఆదివారం అర్ధరాత్రి దొంగలు బీభత్సం సృష్టించారు. పదిరలో కామారెడ్డి- సిరిసిల్ల ప్రధాన రహదారి పక్కన ఉన్న కుంభాల మహేందర్‌రెడ్డి ఇంటి తాళం పగులకొట్టి బీరువా, సూట్‌కేస్, డ్రెసింగ్ టేబుల్‌ను ధ్వంసం చేశారు. అందులోని దుస్తులు, ఇతర వస్తువులను చిందరవందరగా పడేశారు. దేవుడి గదిలోకి వెళ్లి ఫొటోలను తొలగించారు. అరు బయట నిలిపిన స్కూటీ, సెల్‌ఫోన్ ఎత్తుకెళ్లారు. మహేందర్‌రెడ్డి దుబాయిలో ఉండడంతో అతడి భార్య నిర్మల పిల్లలతో కలిసి ఈ నెల 10న ఇంటికి తాళం వేసి గల్ఫ్ వెళ్లింది. అల్మాస్‌పూర్‌లోని ఎల్లమ్మ ఆలయం ప్రధాన ద్వారం తాళం బద్దలుకొట్టిన దొంగలు హుండీని ధ్వంసం చేసి అందులోని రూ.10 వేల నగదు, అమ్మవారి ఆభరణాలను ఎత్తుకెళ్లారు. హుండీని ఆలయం బయట పడేశారు. పక్కనే ఉన్న సంతోష్ హోటల్ షటర్ తాళం పగులకొట్టారు.రూ.20 వేల నగదు, విక్రయించేందుకు సిద్ధంగా ఉన్న రూ.10 వేల విలువైన సిగరేటు ప్యాకెట్లు, శీతల పానీయాలను ఎత్తుకెళ్లారు. ఎస్‌ఐ రమాకాంత్ ఆధ్వర్యంలోడాగ్ స్క్వాడ్, వేలిముద్రల నమూనాల సేకరణ బృందం పోలీసులు ఘటన స్థలాన్ని పరిశీలించారు.బాధితుల ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

నాలుగు తులాల బంగారం, 15వేల నగదు అపహరణ

కోరుట్ల: పట్టణంలోని మినిట్యాంక్ బాండ్ సమీపంలోని తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ జరిగింది. కాలనీకి చెందిన గుండ్లోజీ రాజేందర్ ఇంటికి తాళం వేసి ఆదివారం రాత్రి కటుంబ సభ్యులతో కలిసి బంధువుల ఇంట్లో శుభకార్యానికి వెళ్లారు. సోమవారం ఉదయం ఇంటికి తిరిగి వచ్చి చూడగా తలుపులకు వేసి ఉన్న తాళం పగుల గొట్టి ఉంది. దీంతో యజమాని రాజేందర్ ఇంట్లోకి వెళ్లి చూడగా ఇంట్లో సామగ్రి చిందర వందరగా పడి ఉండి బీరువా తాళం పగులగొట్టి ఉండటంతో చోరీ జరిగినట్లు గుర్తించి పోలీసులకు సమాచారం అందించాడు. సంఘటనా స్థలానికి చేరుకున్న ఎస్‌ఐ కిరణ్ కుమార్ క్లూస్ టీం సహాయంతో తనిఖీలు నిర్వహించారు. నాలుగు తులాల బంగారు అభ రణాలతో పాటు బీరువాలో ఉన్న రూ. 15000 నగదు అపహరణకు గురైనట్లు రాజేందర్ ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

జీవితంపై విరక్తి చెంది ఒకరి ఆత్మహత్య



తిరుపతి (ఫైల్)

సుల్తానాబాద్, ఏప్రిల్ 15: మండలంలోని చిన్న కలువలో జీవితంపై విరక్తితో ఓ వ్యక్తి ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు, బాధిత కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. చిన్న కలువల గ్రామానికి చెందిన గాంట్ల తిరుపతి (40) స్థానికంగా టిఫిన్ సెంటర్ నిర్వహిస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. అందులో నష్టం రావడంతో ఒకరి వద్ద గుమస్తాగా పనిచేశాడు. ఆర్థిక సమస్యలతో భార్య భర్తలు తరుచూ గొడవ పడేవారు. సోమవారం కూడా గొడవ జరగడంతో తిరుపతి బయటకు వెళ్లి మద్యం సేవించి ఇంటికి రావడంతో అసలే ఆర్థిక ఇబ్బందులు ఉండగా మళ్లీ మద్యం తాగి రావడమేంటని భార్య మందలించింది. దీంతో మనస్తాపానికి గురైన తిరుపతి ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడికి భార్య రజిత, ఇద్దరు పిల్లలు ఉన్నారు. పదేళ్ల క్రితమే మొదటి భార్యతో విడాకులు కాగా రజితను రెండో పెళ్లి చేసుకున్నారు. మృతుడి భార్య రజిత ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

వడదెబ్బతో వ్యవసాయ కూలీ మృతి



రమేష్ (ఫైల్)

ముత్తారం ఏప్రిల్ 15: పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలంలోని ఓడేడు గ్రామానికి చెందిన మొగిలి రమేష్ అలియాస్ రవి(45) అనే వ్యవసాయ కూలీ వడదెబ్బతో సోమవారం మృతి చెందాడు. మానేరు అవతల గల భూపాలపల్లి జిల్లా టేకుమట్ల మండలం కలికోట శివారులో గల పొలం వద్దకు మోటారు వేద్దామని ఉదయం వెళ్లి మధ్యాహ్నం వరకు ఇంటికి తిరిగి రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు పొలం వద్దకు వెళ్లి చూడగా మానేరులో కిందపడి ఉన్నాడు. ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. మృతుడు రమేష్‌కు భార్య రాజేశ్వరి, కూతురు, కొడుకు ఉన్నారు.

నిథమ్‌లో టూరిజం కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

కరీంనగర్ టౌన్, ఏప్రిల్ 15: నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టూరిజం అండ్ హాస్పిటాలిటీ మేనేజ్‌మెంట్ (నిథమ్) గచ్చిబౌలి, హైదరాబాద్‌లో టూరిజం కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా పర్యాటకశాఖ అధికారి ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ ఆమోదిత నిథమ్ కళాశాలలో ఇంటర్, డిగ్రీలో బీఎస్సీ, బీబీఏ, ఎంబీఏ అడ్మిషన్ల కోసం విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ఇందులో టూరిజం, హాస్పిటాలిటీ మేనేజ్‌మెంట్ కోర్సులు పూర్తి చేసిన విద్యార్థులకు క్యాంపస్ ఇంటర్వ్యూలతో పాటు దేశంలోని హాస్పిటాలిటీ ఇండస్ట్రీలో అనేక అవకాశాలు లభిస్తాయన్నారు. జాతీయస్థాయి విద్యావిధానంతో నిథమ్‌లో ఉన్నత ప్రమాణాలతో కోర్సులు అందిస్తుందని, అడ్మిషన్, ఇతర వివరాలకు జిల్లా పర్యాటకశాఖ కార్యాలయం, కరీంనగర్‌లోగానీ జిల్లా పర్యాటకశాఖ అధికారి 94408 16070లో సంప్రదించాలని సూచించారు.

రూ.7,400 పలికిన పత్తి ధర

జమ్మికుంట రూరల్, ఏప్రిల్ 15: జమ్మికుంట వ్యవసాయ మార్కెట్లో క్వింటాల్ పత్తి ధర రూ.7,400 పలికింది. సోమవారం మార్కెట్ యార్డుకు 51 మంది రైతులు 644 క్వింటాళ్లు విడి పత్తి, ఎనిమిది మంది రైతులు 18 క్వింటాళ్లు గోనె సంచుల్లో విక్రయానికి తీసుకువచ్చారు. ప్రైవేట్ ట్రేడర్స్ బహిరంగ వేలం ద్వారా గరిష్ఠ ధర రూ.7,400, కనిష్ఠ ధర రూ.6వేలు చెల్లించి పత్తి కొనుగోళ్లు చేపట్టారు.

భక్తోత్సవం ప్రారంభం

అశ్వ వాహనంపై స్వామివారల విహారం


స్వామివారి ఉత్సవమూర్తులు

వేములవాడ, ఏప్రిల్ 15 : వేములవాడ రాజరాజేశ్వర క్షేత్రంలో శ్రీరామ భక్తోత్సవం సోమవారం ఘనంగా ప్రారంభమైంది. శ్రీరామ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఏడో రోజు నుంచి తొమ్మిదో రోజు వరకు మూడు రోజులపాటు నిర్వహించే శ్రీరామ భక్తోత్సవంలో తొలిరోజు ఉదయం ఆలయ స్థానా చార్యులు అప్పాల భీమాశంకర్ నేతృత్వంలో అర్చకులు, వేదపండితులు స్వస్తిపుణ్యా వచనము, గౌరీపూజ, పంచగవ్య మిశ్రణం, ఋత్విక్ వరుణము, యాగశాల ప్రవేశం, మండపారాధన నిర్వ హించారు. అర్చకుల కు వరుణి అందజేశారు. అంతకుముందు రాజరాజేశ్వరస్వామికి మహన్యాస పూర్వక ఏకా దశ రుద్రాభిషేకం, శ్రీసీతారామచంద్ర స్వామివారికి ఉపనిషత్ ద్వారా అభిషేకం చేశారు. పరివార, అనుబంధ దేవతలకు అభిషేకములు నిర్వహించారు. రాత్రి పార్వతీరాజ రాజేశ్వరస్వామి, శ్రీ లక్ష్మీఅనంత పద్మనాభస్వామి వారలను అశ్వ వాహనంపై ఊరేగించారు. ఉత్సవాలలో భాగంగా ఈ నెల 17వ తేదీ బుధవారం శ్రీరామనవమి సందర్భంగా సీతారామ చంద్రస్వామి వారల దివ్య కల్యాణోత్సవం నిర్వహించనున్నారు. ఇందుకోసం ఆలయ చైర్మన్ అతిథిగృహం ముందుభాగంలో వేదికతోపాటు భారీ ఏర్పాట్లు చేపట్టారు.


అర్చకులకు వరుణి అందజేస్తున్న ఆలయ స్థానాచార్యులు


అశ్వవాహనంపై విహరిస్తున్న స్వామివారు

భక్తజన సంద్రంగా రాజన్న క్షేత్రం

వేములవాడ, ఏప్రిల్ 15 : వేములవాడ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం సోమవారం భక్త జనసంద్రంగా మారింది. శ్రీరామ నవరాత్రి ఉత్సవాల సందర్భంగా వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు తమ ఇష్టదైవమైన రాజరాజేశ్వర స్వామివారిని దర్శించుకున్నారు. కళాభవన్‌లో స్వామివారి నిత్య కల్యాణం, సత్యనారాయణ వ్రతం, బాలాత్రిపుర సుందరి దేవి ఆలయంలో కుంకుమ పూజ తదితర ఆర్జిత సేవలలో పాల్గొన్నారు. స్వామివారికి ప్రీతిపాత్రమైన కోడెమొక్కును చెల్లించుకున్నారు. అనుబంధాలయమైన బద్దిపోచమ్మ దేవాలయం భక్తులతో కిక్కిరిసిపోయింది. పెద్దసంఖ్యలో భక్తులు బద్ది పోచమ్మవారిని దర్శించుకొని బోనం మొక్కు చెల్లించుకున్నారు. భీమేశ్వరాలయంలోనూ భక్తుల రద్దీ కొనసాగింది. ఈ సందర్భంగా భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఆలయ అధికారులు ఏర్పాట్లు చేశారు.


బారులుదీరిన భక్తులు

అదుపుతప్పి చెట్టును ఢీకొన్న కారు

ముగ్గురికి తీవ్ర గాయాలు

శంకరపట్నం, ఏప్రిల్ 15: శంకరపట్నం మండలం కేశవపట్నం శివారులోని హెచ్‌పీ గ్యాస్ గోదాం సమీపంలో కరీంనగర్-వరంగల్ జాతీయ రహ దారిపై సోమవారం ఉదయం కారు అదుపు తప్పి చెట్టును ఢీకొన్న ఘటనలో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. హుజూరాబాద్ మండలం రాంపూర్ గ్రామానికి చెందిన ముద్రవేణి ప్రభాకర్ కారులో అతని బంధువు గోనెల సుదర్శన్, గోనెల శ్రీవర్షినిలు మానకొండూర్ మండలం కొండపలకలలో దశదిన కార్యక్రమానికి వెళ్లి సోమవారం తెల్లవారు జామున తిరిగి రాంపూర్‌కు వస్తున్నారు. ఈ క్రమంలోనే కేశవపట్నం శివారులో కారు అదుపుతప్పి చెట్టును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు వెంటనే 108కు సమాచారం అందించారు. ఈఎంటీ సతీష్‌రెడ్డి, పైలట్ గోపీకృష్ణలు సంఘటన స్థలానికి చేరుకొని క్షతగాత్రులను హుజూరాబాద్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. సుదర్శన్ పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు

హుజూరాబాద్ రూరల్, ఏప్రిల్ 15: మండలంలోని తుమ్మనపల్లి గ్రామ శివారులో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాల య్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. సైదాపూర్ మండలం వెన్నంపల్లికి చెందిన శ్రీకాంత్, శంకరపట్నం మండలం చింతగుట్టకు చెందిన మేఘన ద్విచక్ర వాహనంపై కరీంనగర్ వైపు వెళ్తున్నారు. ఈ క్రమంలోనే ఎదురుగా వస్తున్న ఆర్టీసీ బస్సు ఢీ కొట్టినట్లు తెలిపారు. దీంతో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు 108 వాహనం ద్వారా వరంగల్ ఎంజీఎంకు తరలించినట్లు తెలిపారు.

20 నుంచి ఉచిత క్రికెట్ శిక్షణ శిబిరాలు

కరీంనగర్, గోదావరిఖని, సిరిసిల్లలో శిబిరాల నిర్వహణ

18వ తేదీలోపు తమ పేర్లను రిజిస్ట్రేషన్ చేసుకోవాలి

కేడీసీఏ అధ్యక్షుడు వి.ఆగమ్‌రావు

కరీంనగర్ స్పోర్ట్స్, ఏప్రిల్15: హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ) అనుబంధ సంఘం అయిన కరీంనగర్ జిల్లా క్రికెట్ అసోసియేషన్(కేడీసీఏ) ఆధ్వర్యంలో ఈనెల 20 నుంచి వేసవి ఉచిత క్రికెట్ శిక్షణ శిబిరాలను నిర్వహిస్తున్నామని కేడీసీఏ అధ్యక్షుడు వి.ఆగమ్‌రావు తెలిపారు. సోమవారం జిల్లా కేంద్రంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ క్రికెట్ శిక్షణ శిబిరాలను కరీంనగర్, గోదావరిఖని, సిరిసిల్లలో నిర్వహిస్తున్నామని తెలిపారు. అండర్-14, 16, 19, 23 వయస్సు విభాగాలలో బాలబాలికలకు ఈ ఉచిత శిక్షణ శిబిరాలను నిర్వహిస్తున్నామని తెలిపారు. ఆయా శిక్షణ కేంద్రాల్లో నిష్ణాతులైన కోచ్‌లు, ట్రైనర్లను నియమిస్తున్నామని చప్పారు. అలాగే క్రీడాకరుల కోసం క్రికెట్ నెట్లతో పాటు జంబోకిట్లు, అందుబాటులో ఉంచామన్నారు.

ఈ శిక్షణ శిబిరాలలో ప్రతిభ చాటే క్రీడాకారులను హెచ్‌సీఏ, కేడీసీఏల ఆధ్వర్యంలో నిర్వహించే జిల్లా, రాష్ట్ర స్థాయి క్రికెట్ పోటీల్లో పాల్గొనే అవకాశాన్ని కల్పిస్తామని తెలిపారు. ప్రతి రోజు ఉదయం 6గంటల నుంచి 9 వరకు ఈ శిక్షణ శిబిరాలు నిర్వహిస్తామన్నారు. ఆరు సంవత్సరాల తరువాత ప్రతిష్ఠాత్మ కంగా నిర్వహిస్తున్న ఈ శిక్షణ శిబిరాలలో పాల్గొనే సదావకాశాన్ని క్రీడా కారులు వినియోగించుకోవాలన్నారు. ఆసక్తి గల బాల బాలికలు తమ పేర్లను www.hycricket.org వెబ్‌సైట్‌లో ఈనెల 16 నుంచి 18 తేదీ సాయంత్రం 6 గంటల వరకు నమోదు చేసుకోవాలని సూచించారు. ఈనెల 20న ప్రారంభమయ్యే ఉచిత శిక్షణ శిబిరాలు మే నెల 20వరకు నెల రోజుల పాటు కొనసాగుతాయని తెలిపారు. శిబిరాల్లో పాల్గొనే క్రీడాకారులకు హెచ్‌సీఏ సహకారంతో ఉదయం పౌష్టికాహారాన్ని అందించనున్నామన్నారు. అలాగే త్వరలో కరీంనగర్ జిల్లా కేంద్రంలో కెపిఎల్ క్రికెట్ టోర్నమెంట్‌ను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా క్రికెట్ సంఘం బాధ్యులు ఉచిత క్రికెట్ శిబిరాల ప్రచార బ్రోచర్‌ను ఆవిష్కరించారు. క్రీడాకారులు తమ సందేహాలను నివృత్తికి 80087 29397 నంబరులో సంప్రదించాలని తెలిపారు. ఈ సమావేశంలో కేడీసీఏ ప్రధాన కార్యదర్శి ఎం మురళీధర్‌రావు, ఉపాధ్య క్షుడు పి మనోహర్‌రావు, కె మహేందర్‌గౌడ్, క్రికెట్ కోచ్ కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కేడీసీఏ అధ్యక్షుడు ఆగమ్‌రావు

ఎండోమెంట్ కమిషనర్ ఆదేశాలపై నిర్లక్ష్యం

● ఇరవై రోజుల క్రితం చర్యలకు ఆదేశం ● ఎట్టకేలకు కొండగట్టు ఉద్యోగులకు మెమోలు

మల్యాల, ఏప్రిల్ 15: దేవాదాయ శాఖ కమిషనర్ ఆదేశాలపై గత ఇరవై రోజులుగా స్తబ్ధుగా ఉన్న అధికారులు కదిలారు. కొండగట్టు అంజనేయ స్వామి దేవస్థానం పరిధిలో కొన్నాళ్ల క్రితం విధులు నిర్వహించిన ఏఈవో బుద్ధి శ్రీనివాస్‌తో పాటు పర్యవేక్షకులు శ్రీనివాస్‌శర్మ, సునీల్‌కు సోమవా రం ఈవో చంద్రశేఖర్ మెమొలు జారీ చేశారు. ఇక్కడి సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాస్ చారీ దేవస్థానానికి సంబంధించిన టెండర్ల సొమ్ములు దాదాపు రూ.52లక్షలు దుర్వినియోగం చేశారనే దానిపై అప్పట్లోనే అప్పటి ఈవో వెంకటేష్ శ్రీనివాస్‌చారీతో పాటు పర్యవేక్షణ అధికారులకు చార్జీ మెమోలు అందించారు. అనంతరం శ్రీనివాస్ చారీని సస్పెండ్ చేయడంతో పాటు పోలీస్‌స్టేషన్‌లోనూ కేసు నమోదు చేశారు. కొన్నాళ్లకు ఏడీసీ జ్యోతి సొమ్ముల దుర్వినియోగంపై విచారణ జరిపిన అనంతరం పర్యవేక్షణ లోపం, నిర్లక్ష్యం వహించినందుకు గాను గత నెల 23న ఈవోపై దేవాదాయశాఖ క మిషనర్ సస్పెన్షన్ వేటు వేశారు. ఈవోపై చర్యలు తీసుకుంటూనే సదరు పర్యవేక్షణ అధికారుల నిర్లక్ష్యంపై కూడా చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు. అయితే ఇక్కడి అధికారులు కమిషనర్ ఆదేశాలపై ఇరవై రోజులు గడిచినప్పటికీ కమిషనర్ ఆదేశాలపై ముందుకు కదలకపోగా ఎలాంటి చర్యలు తీసుకోలేదు. ఎట్టకేలకు సోమవారం ముగ్గురు అధికారులకు మెమోలు అందించారు. అంజన్న సొమ్ముల దుర్వినియోగంపై గత పదేళ్ల రికార్డుల తనిఖీలు కొనసాగుతున్నట్లు తెలుస్తుంది.

జమ్మికుంటలో మద్యం పట్టివేత

జమ్మికుంట, ఏప్రిల్ 15: జమ్మికుంట మున్సిపల్ పరిధిలోని హనుమండ్లపల్లిలో ఓ వ్యక్తి అక్రమంగా విక్రయిస్తున్న మద్యం బాటిళ్లను సోమవారం పోలీస్‌లు పట్టుకున్నారు. ఓ వ్యక్తి తన ఇంట్లో మద్యం విక్రయిస్తున్నాడని సమాచారం అందుకున్న బ్లూకోర్టు సిబ్బంది తనిఖీలు చేపట్టారు. రూ.2,280 విలువ గల మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐ వరంగంటి రవి తెలిపారు.

బెల్ట్ షాపు నిర్వాహకుడిపై కేసు నమోదు

ఇల్లందకుంట, ఏప్రిల్ 15: మండలంలోని సీతంపేట గ్రామానికి చెందిన ఓ బెల్ట్ షాపు యజ మానిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ రాజకుమార్ సోమవారం తెలిపారు. పార్లమెంట్ ఎన్నికల సమయంలో ఎన్నికల నియమావళిని ఉల్లంఘించి అక్రమంగా మద్యం అమ్ముతుండగా అతన్ని అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసి రూ. 30వేల జరిమానా విధించినట్లు తెలిపారు. ఎస్‌ఐ మాట్లాడుతూ నిబంధనలు ఉల్లంఘిస్తే కేసులు తప్పవని హెచ్చరించారు.

డ్రంకెన్‌డ్రైవ్ కేసులో ఏడుగురికి జైలు శిక్ష

కరీంనగర్ క్రైం, ఏప్రిల్ 15: డ్రంకెన్‌డ్రైవ్ కేసులో ఏడుగురు వాహనదారులకు జైలు శిక్ష, జరిమానా పడిందని కరీంనగర్ ట్రాఫిక్ సీఐ కరీం ఉల్లాఖాన్ తెలిపారు. మద్యం సేవించి వాహనాలు నడుపుతూ తనిఖీలలో పట్టుబడిన 21 మంది వాహనదారులను సోమవారం కరీంనగర్ మున్సిఫ్ కోర్టులో హాజరుపరచగా ముగ్గురు వాహనదారులకు ఐదు రోజుల జైలుశిక్ష, నలుగురు వాహనదారులకు మూడు రోజుల జైలు శిక్ష, మొత్తం రూ. 12 వేల జరిమానా విధించారని తెలిపారు. మిగతా 14 మంది వాహనదారులకు 23, 500 రూపాయలు జరిమానా విధించినట్లు సీఐ తెలిపారు.

ఇసుక లారీ పట్టివేత

కాల్వశ్రీరాంపూర్, ఏప్రిల్ 15: మండలంలోని మల్యాల గ్రామ సమీపంలో సోమవారం లారీ(టీఎస్ 24 7272)లో అక్రమంగా ఇసుకను తరలిస్తుండగా ఎస్సై ఓంకార్ యాదవ్ పట్టుకున్నారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ అంబాల రవి అక్రమంగా ఇసుక వ్యాపారం నిర్వహించేవాడని, అందులో భాగంగానే అర్ధరాత్రి సమయంలో గుంపుల గ్రామ సమీపంలోని మానేరు నది వద్దకు వెళ్లి అక్కడ జేజా శ్రీనివాస్ జేసీబీ సహాయంతో ఇసుకను లోడ్ చేసి, లోడింగ్ పూర్తయిన తర్వాత అక్రమంగా తరలిస్తుండగా పట్టుకున్నట్టు తెలిపారు. డ్రైవర్‌తోపాటు లారీని పోలీస్ స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసినట్టు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి

వేములవాడ, ఏప్రిల్ 15 : వేములవాడ పట్టణంలోని న్యూ అర్బన్ కాలనీ చెందిన ఎండీ షారుక్ (26) రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. ఫాజుల్ నగర్‌కు చెందిన షారుక్ కుటుంబం కొంతకాలంగా వేములవాడలోని అర్బన్ కాలనీలో నివాసం ఉంటోంది. ఆదివారం రాత్రి శాత్రాజుపల్లి నుంచి ద్విచక్ర వాహనంపై తిరిగి వస్తున్న క్రమంలో సాయిరక్ష సమీపంలో రహదారి మరమ్మతు పనులు జరుగుతున్న ప్రాంతంలో ప్రమాదవశాత్తు డివైడర్‌ను ఢీ కొట్టాడు. తలకు తీవ్రంగా గాయాలయ్యాయి. దీంతో చికిత్స కోసం హైదరాబాద్ తరలించగా చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. మృతుడికి భార్య, 11 నెలల వయస్సు ఉన్న కూతురు ఉన్నట్లు పోలీసులు తెలిపారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌చార్జి సీఐ శ్రీనివాస్ తెలిపారు.

ట్రాక్టర్ చోరీలకు పాల్పడుతున్న నిందితుల పట్టివేత

● ముగ్గురితో పాటు బాలుడి అరెస్ట్ ● ట్రాక్టర్, ద్విచక్రవాహనం, సెల్‌ఫోన్ల స్వాధీనం


నిందితుల అరెస్ట్ చూపుతున్న పోలీసులు

మల్యాల, ఏప్రిల్ 15: వ్యవసాయంతో వస్తున్న ఆదాయం సరిపోవడం లేదని ఎక్కువగా సంపాదించాలనే అత్యాశతో ట్రాక్టర్ దొంగతనాలకు పాల్పడుతున్న ముగ్గురు వ్యక్తులతో పాటు ఓ బాలుడిని పోలీసులు పట్టుకున్నారు. మండలంలోని రాజారంలో ఇటీవల ట్రాక్టర్ ఎత్తుకెళ్లిన దొంగలను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. జగిత్యాల డీఎస్పీ రఘుచందర్ విలేకరుల సమావేశంలో తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. నిర్మల్ జిల్లా కడెం మండలం అల్లంపల్లికి చెందిన సింగారెడ్డి చంద్రశేఖర్‌రెడ్డితో పాటు మరో బాలుడు, ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్ మండలం షామ్‌నగర్‌కు చెందిన పెంబి రాజులు వ్యవసాయం, కూలీపనులతో వచ్చే ఆదాయం సరిపోక ట్రాక్టర్‌ల దొంగతనాలకు పాల్పడుతూ ఉన్నారు. ఇందులో భాగంగా కొన్నాళ్ల క్రితం చంద్రశేఖర్‌రెడ్డి, రాజు గుడిహత్నూర్‌లో ట్రాక్టర్ దొంగతనం చేయడంతో అక్కడి పోలీసులు కేసు నమోదు చేశారు. మళ్లీ దొంగతనాలకు జగిత్యాల ప్రాంతానికి వచ్చిన నలుగురు రెక్కీ నిర్వహిస్తూ మల్యాల మండలం రాజారం శివారులో గడ్డం చంద్రశేఖర్‌రెడ్డి ఇంటి ముందు నిలిపి ఉన్న రెండు ట్రాక్టర్లలో ఒక్క దాన్ని ఎత్తుకెళ్లారు. ఆ ట్రాక్టర్‌ను ఎవరూ గుర్తు పట్టకూడదని కొండగట్టు ప్రాంతంలోని గుట్టలలో రంగులు మార్చి సోమవారం తమ గ్రామానికి తీసుకెళుతుండగా ముగ్గురు నిందితులతో పాటు బాల నేరస్థుడిని కొండగట్టు వద్ద పెట్రోలింగ్ నిర్వహిస్తున్న పోలీసులకు పట్టుబడ్డారు. దీంతో వారి వద్ద ట్రాక్టర్, ట్రాలీ, ద్విచక్ర వాహనం, మూడు సెల్‌ఫోన్‌లు స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కోర్టులో హాజరుపరచినట్లు డీఎస్పీ పేర్కొన్నారు. ఈ సమావేశంలో మల్యాల సీఐ నీలం రవి, ఎస్సైలు అబ్దుల్‌రహీం, కుమారస్వామి పాల్గొన్నారు.

మయూరగిరి పీఠంలో సర్వారిష్ఠ శాంతి పూజలు



పూర్ణాహుతి నిర్వహిస్తున్న వేదపండితులు

కరీంనగర్ కల్చరల్, ఏప్రిల్ 15: నగరంలోని తిరుమలనగర్ మయూరగిరిపీఠం (శ్రీనిలయం)లో వసంత నవరాత్ర్యుత్సవాల్లో భాగంగా లోక కల్యాణార్థం సోమవారం మయూరగిరి పీఠాధిపతి నమిలకొండ రమణాచార్యస్వామి ఆధ్వర్యంలో నక్షత్రేష్టి పూర్వక సర్వారిష్ఠ శాంతి శాస్త్రోక్తంగా జరిపారు. అన్ని రాశులు, నక్షత్రాలకు చెందిన సకల వర్గాలు, రంగాలకు చెందిన ప్రజలు సుఖ శాంతులతో వర్ధిల్లాలని సంకల్పం చేసి కార్యక్రమాన్ని నిర్వహించామని రమణాచార్యస్వామి పేర్కొన్నారు. కార్యక్రమంలో పండితులు సముద్రాల వేణుగోపాలాచార్యులు, రామకృష్ణమాచార్యులు, గోపీశర్మ, శివరామకృష్ణశర్మ, వినయ్, వివేక్ పాల్గొన్నారు.

శ్రీ చైతన్య కళాశాలలో ఫేర్‌వెల్ డే వేడుకలు



మాట్లాడుతున్న ఎస్‌యూ వీసీ సంకశాల మల్లేష్

గణేశ్‌నగర్, ఏప్రిల్ 15: మంకమ్మతోటలోని శ్రీ చైతన్య డిగ్రీ, పీజీ కళాశాల ఫేర్‌వెల్ డే వేడుకలు సోమవారం రేకుర్తిలోని శుభంగార్డెన్స్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన శాతవాహన విశ్వవిద్యాలయం ఉపకులపతి ప్రొఫెసర్ సంకశాల మల్లేష్ మాట్లాడుతూ విద్యార్థులు లక్ష్య సాధనకు కృషి చేయాలన్నారు. కళాశాలకు చెందిన ఫుడ్ సైన్స్ న్యూట్రిషన్ విద్యార్థులు హైదరాబాద్‌లోని ప్రముఖ హాస్పిటల్స్‌లో ఇంటర్నషిప్ పూర్తిచేశారన్నారు. డిగ్రీ స్థాయిలో విద్యార్థులు బహుళ జాతి సంస్థల్లో ఉద్యోగాలు పొందడం గొప్ప విషయం అన్నారు. కళాశాల ఛైర్మన్ ముద్దసాని రమేష్‌రెడ్డి వివిధ రంగాల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈవిద్యా సంవత్సరంలో 100 మంది శ్రీ చైతన్య డిగ్రీ విద్యార్థులు బహుళ జాతి సంస్థలకు ఎంపికయ్యారన్నారు. కార్యక్రమంలో డైరెక్టర్ కే.నరేందర్‌రెడ్డి, ప్రిన్సిపాల్స్ డా.ఎల్ శ్రీనివాస్, డా స్వర్ణలత వైస్ ప్రిన్సిపాల్ ఎస్ కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

రాముడి జీవితం ఆదర్శం

-చిన్న జీయరుస్వామి

కరీంనగర్ కల్చరల్, ఏప్రిల్ 15: మానవాళికి రాముడి జీవితం ఆదర్శమని, ఆయన గుణగణాలను అందరూ అలవర్చుకోవాలని త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చిన్న జీయర్‌స్వామి అన్నారు. జెట్, వికాస తరంగిణి ఆధ్వర్యంలో క్రోధి నామ నూతన సంవత్సర ఉగాది వేడుకల్లో భాగంగా పద్మనాయక కల్యాణ మండపంలో జరుగుతున్న వసంత నవరాత్రి ఉత్సవాల్లో సోమవారం స్వామి ప్రవచనం చేశారు. ఉదయం శ్రీమద్రామాయణ హవనం, తీర్థగోష్ఠి, మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ జరిగింది. ఈ కార్యక్రమంలో చల్మెడ లక్ష్మీనరసింహరావు, వీర్ల ప్రభాకర్‌రావు, కలకొండ గౌతమరావు, బీవీ రావు, యాద కిషన్, ఎల్ భూపతిరావు, ఎస్ వేంకటేశం, వరప్రసాదాచార్యులుతో పాటు పాటు భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

సమస్యలతో సతమతవుతున్న ఉపాధి హామీ కూలీలు

కరీంనగర్ రూరల్, ఏప్రిల్ 15: ఉపాధిహామీ కూలీలు పలు సమస్యలతో సతమతమవుతున్నారని కరీంనగర్ పార్లమెంట్ బీఆర్‌ఎస్ అభ్యర్థి వినోద్‌కుమార్ సతీమణి డాక్టర్ మాధవి అన్నారు. సోమవారం కొత్తపల్లి మండలంలోని ఎలగందల్, ఖాజీపూర్ గ్రామాల్లో ఉపాధి హామి కార్మికుల వద్దకు వెళ్లి ప్రచారం నిర్వహించారు. కార్మికుల హక్కుల సాధించుకోవాలంటే కార్మికుల పక్షపాతి అయిన బోయినపల్లి వినోద్‌కుమార్‌ను గెలిపించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కొత్తపల్లి ఎంపీపీ పిల్లి శ్రీలతమహేష్, జిల్లా పరిషత్ కో-ఆప్షన్ సభ్యుడు సాబీర్ పాషా, మాజీ మార్కెట్ కమిటీ ఛైర్మన్ రెడ్డవేణి మధు, కొత్తపల్లి వైస్ ఎంపీపీ భూక్య తిరుపతినాయక్, బోనాల శంకర్, బోనాల నర్సయ్య, ఆవుల శ్రీనివాస్, శ్రీరామ్ సురేం దర్, యాస వెంకన్న ఇల్లెందుల శేఖర్, సోమినేని తిరుపతి, డైరెక్టర్ లింగయ్య, వెంకటేశ్వర్‌రావు, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

కాలువను కబ్జా చేస్తున్నారని అధికారులకు ఫిర్యాదు

హుజూరాబాద్, ఏప్రిల్ 15: హుజూరాబాద్ పట్టణంలోని జమ్మికుంట రోడ్‌లో మోడల్ చెరువు నుంచి గుండ్ల చెరువుకు వెళ్లే కాలువను కబ్జా చేస్తున్నారని మున్సిపల్, ఇరిగేషన్ అధికారులకు సోమవారం ఫిర్యాదు చేసినట్లు కొలిపాక సమ్మయ్య తెలిపారు. కొంతమంది కాలువలో మట్టిని పోసి నింపుతున్నారన్నారు. ఫిర్యాదుకు స్పందించిన మున్సిపల్, ఐబీ అధికారులు విచారణ చేశారన్నారు. కాలువ కబ్జా చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని సమ్మయ్య కోరారు.

కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించాలి

హుజూరాబాద్‌రూరల్, ఏప్రిల్ 15: ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే రైతులు ధాన్యాన్ని విక్రయించుకొని సరైన మద్దతు ధరను పొందాలని ఏఈవో సతీష్‌కుమార్ అన్నారు.సోమవారం మండలంలోని రంగాపూర్, ఇప్పలనర్సింగాపూర్, దమ్మక్కపేటలోని వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించారు. ఏ గ్రేడ్ రకానికి రూ.2203, సాధారణ రకానికి రూ.2183లు పొందవచ్చని తెలిపారు. హుజూరాబాద్ సొసైటీ సీఈవో వివేకానంద, డీసీఎంఎస్ ఇంచార్జీ ప్రదీప్ కుమార్ తదితరులు ఉన్నారు.

ఎన్నికల నియమావళిని పాటించాలి

శంకరపట్నం, ఏప్రిల్ 15: ప్రతి ఒక్కరూ ఎన్నికల నియమావళిని పాటించాలని హుజూరాబాద్ రూరల్ సీఐ వెంకట్ అన్నారు. సోమవారం మండలంలోని లింగాపూర్ గ్రామంలో కేశవపట్నం ఎస్ఐ పాకాల లక్ష్మారెడ్డితో కలిసి కేంద్ర బలగాలతో ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ వెంకట్ మాట్లాడుతూ ఎన్నికల నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, కేంద్ర బలగాలు పాల్గొన్నారు.

సింగిడి గోడ పత్రిక ఆవిష్కరణ

హుజూరాబాద్‌రూరల్, ఏప్రిల్ 15: మండలంలోని సింగాపూర్ వీఎస్‌ఆర్ డిగ్రీ కళాశాల ఆవరణలో సింగిడి గోడ పత్రికను కళాశాల ప్రిన్సిపాల్ వివిఎన్ హనుమకుమార్ ఆవిష్కరించారు. ఈ నెల 20,21వ తేదీల్లో ఓయూలో సింగిడి పేరిట సాంస్కృతిక ఉత్సవాలు జరగనున్నాయి. కార్యక్రమంలో ఏబీవీపీ నగర కార్యదర్శి గోస్కుల అజయ్, సంయుక్త కార్యదర్శి తేజ, అభిషేక్, కన్వీనర్ సత్యనారాయణ, కో కన్వీనర్ శనిగరపు అజయ్, ఓం ప్రకాష్ తదితరులు ఉన్నారు.

విద్యార్థులు నైపుణ్యాలను అలవర్చుకోవాలి

హుజూరాబాద్‌రూరల్, ఏప్రిల్ 15: విద్యార్థులు ప్రజెంటేషన్ స్కిల్స్‌ను అలవర్చుకోవాలని కిట్స్ కళాశాల డైరెక్టర్ కె. శంకర్ అన్నారు. సోమవారం మండలంలోని సింగాపూర్ కిట్స్ కళాశాలలో ఈసీఈ విభాగం ఆధ్వర్యంలో 'నేషనల్ కాన్ఫరెన్స్ ఆఫ్ అడ్వాన్స్ ఇన్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ' అనే అంశంపై జాతీయ స్థాయి శిక్షణలో మాట్లాడారు. కార్యక్రమంలో ఈసీఈ డీన్ అకాడమిక్ డాక్టర్ బి. రమేష్, సమన్వయకర్తలు శ్యాంసుందర్, గౌరి పుండలిక్ ఉన్నారు.

రామడుగు ఎంపీపీగా హరీష్



హరీష్‌ను అభినందిస్తున్న ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

రామడుగు, ఆర్ఎండి 15: మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఆర్డీవో ఆధ్వర్యంలో ఎంపీపీ ఎన్నికలు నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్‌కు చెందిన వన్నారం ఎంపీటీసీ జవాజి హరీష్ నామినేషన్ దాఖలు చేశారు. మండలంలో 14 మంది ఎంపీటీసీలకు గాను వెలిచాల ఎంపీటీసీ వీర్ల వసంత తన పదవికి రాజీనామా చేశారు. 13 మంది ఎంపీటీసీలలో తనతో పాటు 11 ఎంపీటీసీల మద్దతు ఉందని హరీష్ ఆర్డీవోకు పత్రాలను అందజేశారు. మరో నామినేషన్ దాఖలు కాకపోవడంతో హరీష్ ఏకగ్రీవంగా ఎన్నిక అయినట్లు ఆర్డీవో ప్రకటించారు. నూతనంగా ఎన్నిక అయిన హరీష్ బాధ్యతలు స్వీకరించారు. కాగా స్థానిక ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం హరీష్‌ను అభినందించారు.

'కాంగ్రెస్‌తోనే మైనార్టీల అభివృద్ధి సాధ్యం'



మాట్లాడుతున్న టీపీసీసీ మైనార్టీ సెల్ ఉపాధ్యక్షుడు సైఫుల్లా కలేజ్

కరీంనగర్ అర్బన్, ఏప్రిల్ 15: మైనార్టీల సంక్షేమం, అభివృద్ధి కాంగ్రెస్‌తోనే సాధ్యమని టీపీసీసీ మైనార్టీ సెల్ ఉపాధ్యక్షులు సైఫుల్లా కలేజ్ అన్నారు. సోమవారం జిల్లా కాంగ్రెస్‌పార్టీ కార్యాలయంలో కరీంనగర్, పెద్దపల్లి, ఆదిలాబాద్, నిజామా బాద్, హన్మకొండ పార్లమెంట్ నియోజకవర్గాల కాంగ్రెస్ పార్టీ మైనార్టీ విభాగం ఇన్‌చార్జిలు, జిల్లాల అధ్యక్షులతో సమావేశం జరిగింది. ఈ సమావేశానికి సైఫుల్ల కలేజ్ ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రసంగించారు. రాబోయే ఎన్నికలలో కాంగ్రెస్‌పార్టీ అభ్యర్థులకు మైనార్టీలు అధిక శాత ఓట్లు పడే విధంగా కృషి చేయాలని అన్నారు. కాంగ్రెస్‌పార్టీ కేంద్రంలో అధికారంలోకి వస్తేనే మైనార్టీలకు రక్షణ ఉంటుందని, అభివృద్ధి చెందుతారన్నారు. పార్లమెంట్ నియోజకవర్గ ఇంచార్జిలు, జిల్లాల అధ్యక్షులు కాంగ్రెస్ అభ్యర్థుల గెలుపులో కీలక పాత్ర పోషించాలన్నారు.

క్షేత్రస్థాయిలో ఇంటింటి ప్రచారం నిర్వహించాలని సూచించారు. కాంగ్రెస్‌పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే అమలు చేయబోయే హామీలను ప్రజలకు వివరించి, వారి మద్దతును కూడగట్టాలన్నారు. ఈ సమావేశంలో కరీంనగర్ పార్లమెంట్ ఇంచార్జిల్లా, జిల్లా మైనార్టీ సెల్ అధ్యక్షులు మొహమ్మద్ తాజుద్దీన్‌తోపాటు ఆదిలాబాద్ పార్లమెంట్ ఇంచార్జి లతీఫ్, హన్మకొండ పార్లమెంట్ ఇంచార్జి అజిత్, నాలుగు జిల్లాల అధ్యక్షులు, నియోజకవర్గ అబ్జర్వర్లు, ముఖ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

'వివేకానంద'లో వీడ్కోలు హంగామా

గణేశ్‌నగర్,ఏప్రిల్ 15 : వివేకానంద డిగ్రీ అండ్ పీజీ కళాశాలలో డిగ్రీ మొదటి సంవత్సరం ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థులు తృతీయ సంవత్సరం విద్యార్థులకు ఆడియో 2024,పేరిట ఫేర్వెల్ పార్టీని ఘనంగా నిర్వహించడం జరిగిందని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సిహెచ్. శ్రీనివాస్ తెలిపారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ డిగ్రీ పూర్తవుగానే సమయాన్ని వృథా చేయకుండా వివిధ రకాల పోటీ పరీక్షల కు సన్నద్ధం కావాలని దీని సాధించడానికి నిరంతర కృషి అవసరమని తెలిపారు. అకాడమిక్ కోఆర్డినేటర్ బి సంపత్‌కుమార్ మాట్లాడుతూ రాబోయే వార్షిక పరీక్షలలో విద్యార్థులు మంచి ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఏవో బి శ్రవణ్ కుమార్, బి రామేశ్వరరావు వివిధ విభాగదీపతులు, అధ్యాపక బృందం విద్యార్థులు పాల్గొన్నారు.

'టీపీటీఎఫ్ బాధ్యులను సస్పెండ్ చేయడం సరికాదు'

కరీంనగర్ టౌన్, ఏప్రిల్ 15: పదో తరగతి జవాబు పత్రాల మూల్యాంకనంలో సెల్‌ఫోన్‌ను ఉపయోగిస్తున్నారని కేవలం టీపీటీఎఫ్ సంఘం జిల్లా అధ్యక్షుడు పోరెడ్డి దామోదర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి ఆర్.చంద్రశేఖర్‌రావును డీఈవో జనార్ధన్‌రావు సస్పెండ్ చేయడం సరికాదన్నారు. ఇది కేవలం ప్రశ్నిస్తున్నందుకు చేస్తున్న కక్షసాధింపు చర్య మాత్రమేనని టీపీటీఎఫ్ ఒక ప్రకటనలో తీవ్రంగా ఖండించింది. మ్యూలంకనం చేస్తున్న సాధారణ ఉపాధ్యాయుల వద్ద సెల్‌ఫోన్ లభించినపుడు వారిని క్షమించి వదిలిపెట్టి సంఘ నేతలను మాత్రమే సస్పెండ్ చేయడం అనేది విచారకరమన్నారు. వెంటనే సస్పెండ్ ఆర్డర్లను రద్దు చేసి జాయినింగ్ ఆర్డర్ ఇవ్వాలని టీపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి మాడుగుల రాములు డిమాండ్ చేశారు.

'భద్రాద్రి ప్రత్యక్ష ప్రసారాన్ని ఆపకూడదు'

కరీంనగర్ కల్చరల్, ఏప్రిల్ 15: శ్రీరామనవమి సందర్భంగా భద్రాద్రిలో జరిగే సీతారామ కల్యాణ ప్రత్యక్ష ప్రసారాన్ని ఆపకూడదని గీతాభక్త సమాజం బాధ్యులు వుప్పల రామేశం, బండ సత్తయ్య తదితరులు ఒక ప్రకటనలో ఎలక్షన్ కమీషన్‌కు విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర మంత్రి కొండా సురేఖ కూడా స్టేట్ ఎలక్షన్ చీఫ్ వికాస్‌రాజ్‌కు విజ్ఞప్తి చేశారని తెలిపారు. చాలా మంది పేద, వృద్ధ, దివ్యాంగులు ప్రసారాలను వీక్షిస్తుంటారని తెలిపారు. ఆధ్యాత్మిక, భగవత్కార్యాన్ని ప్రసారం చేసేందుకు ఎలక్షన్ కోడ్ ఎలా అడ్డు పడుతుందని వారు ప్రశ్నించారు.

గురుకుల కళాశాలలో అవగాహన సదస్సు

కరీంనగర్ రూరల్, ఏప్రిల్ 15: తెలంగాణ సాంఘిక సంక్షేమ మహిళా గురుకుల డిగ్రీ కళాశాల నగునూరులో మేథో సంపత్తి హక్కులపై సోమవారం ఆన్‌లైన్ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సమత, రిసోర్స్ పర్సన్ వనపర్తి రమేష్, అసిస్టెంట్ కంట్రోలర్ ఆఫ్‌పేటెంట్స్ అండ్ డిజైన్ ఇంటెలెక్చువల్ ప్రాపర్టీ ఆఫ్ ఇండియా సభ్యులు, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్ సుష్మ, జి స్వప్న, మనీష పాల్గొన్నారు.

చలివేంద్రం ఏర్పాటు

కరీంనగర్‌రూరల్, ఏప్రిల్ 15: కొత్తపల్లి మండలంలోని మల్కాపూర్ గ్రామంలోని కొనుగోలు కేంద్రంలో నరహరి భరత్‌రెడ్డి జ్ఞాపకార్థం రైతు సేవా సమితి అధ్యక్షుడు నరహరి లక్ష్మారెడ్డి షెడ్డు, చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. రైతులు సేద తీరడానికి గాను షెడ్డును సొంత ఖర్చులతో నిర్మించడంతో పాటు, చలివేంద్రం ఏర్పాటు చేశారు.

కరీంనగర్‌ను విద్యాహబ్‌గా తీర్చిదిద్దుతా

-బీఆర్ఎస్ కరీంనగర్ ఎంపీ అభ్యర్థి వినోద్‌కుమార్

కరీంనగర్ టౌన్, ఏప్రిల్ 15: తనను గెలిపిస్తే కరీంనగర్‌ను విద్యాహబ్‌గా తీర్చిదిద్దుతానని బీఆర్ఎస్ కరీంనగర్ ఎంపీ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్ ప్రజలను అభ్యర్థించారు. సోమవారం లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా స్థానిక 60వ డివిజన్‌లో మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంగుల కమలాకర్, నగర మేయర్ యాదగిరి సునీల్ రావు, కార్పొరేటర్ వాల రమణారావులతో కలిసి స్థానికులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వినోద్‌కుమార్ మాట్లాడుతూ ఐదేళ్లలో ఎంపీ బండి సంజయ్ కుమార్ ఐదు రూపాయలు కూడా తీసుకు రాలేదని విమర్శించారు. కార్యక్రమంలో మాజీ జడ్పీ ఛైర్‌పర్సన్ తుల ఉమ, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు, మాజీ సివిల్ సప్లయి కార్పొరేషన్ ఛైర్మన్ రవీందర్‌సింగ్, బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్ పాల్గొన్నారు.

న్యాయవాదులు మద్దతు ఇవ్వండి

కరీంనగర్ లీగల్, ఏప్రిల్ 15: పార్లమెంట్ సభ్యుడిగా, ఆ తర్వాత ప్లానింగ్ కమిషన్ వైస్ ఛైర్మన్‌గా కొనసాగిన సమయంలో న్యాయవాదుల సంక్షేమం కోసం ఎంతో కృషిచేశానని, న్యాయవాదులు తనకు మద్దతు తెలుపాలని కరీంనగర్ లోక్‌సభ బీఆర్ఎస్ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్ న్యాయవాదులకు విజ్ఞప్తి చేశారు. సోమవారం జిల్లా కోర్టులోని బార్ అసోసియేషన్ హాల్‌లో న్యాయవాదులతో ఆయన సమావేశమయ్యారు. ఈకార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పీవీ రాజ్‌కుమార్, ఉపాధ్యక్షుడు రఘువీర్, ప్రధాన కార్యదర్శి బేతి మహేందర్‌రెడ్డి, మాజీ మేయర్ సర్దార్ రవీందర్‌సింగ్ పాల్గొన్నారు.

'ఆరు గ్యారెంటీలు అమలు చేయని కాంగ్రెస్'



కరపత్రాలను పంపిణీ చేస్తున్న బీజేపీ నాయకులు

భగత్‌నగర్, ఏప్రిల్15: కాంగ్రెస్‌పార్టీ ఆరు గ్యారెంటీలను అమలు చేయ కుండా ప్రజలను మోసం చేస్తున్నదని బీజేపీ కరీంనగర్ పార్లమెంట్ కన్వీనర్ బోయినపల్లి ప్రవీణ్ రావు అన్నారు. సోమవారం విజయ్ సంకల్ప అభియాన్ కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి వెళ్లి బీజేపీ అభివృద్ధి పనులను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశం కోసం ప్రజల సంక్షేమం కోసం బీజేపీ నిరంతరం కృషి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో గుండారపు సంపత్, ప్రదీప్, న్యాత ప్రవీణ్, మొగిళి, సురేష్, రాకేష్, అరుణ్, ప్రశాంత్, చైతన్య, శివమణి పాల్గొన్నారు.

●నగరంలోని రేకుర్తి 18వ డివిజన్‌లో ఇంటింటికి బీజేపీ కార్యక్రమం నిర్వహించారు. ఈకార్యక్రమంలో బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర కార్యదర్శి జాడి బాల్‌రెడ్డి, కడారి మహేశ్వర్‌రెడ్డి, నాంపల్లి శంకర్, పింగిలి ప్రతాప్‌రెడ్డి, పీచర విష్ణు ప్రసాద్‌రావు పాల్గొన్నారు.

● కరీంనగర్ మండలం గోపాల్‌పూర్ గ్రామంలో బీజేవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శి ఊరడి శివారెడ్డి ఆధ్వర్యంలో ఇంటింటికి బీజేపీ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో సింగిరెడ్డి రాజకుమార్‌రెడ్డి, అనుముల నాగరాజు, దాడి అనిల్, ఊరడి అశోక్ పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాలను పరిశీలించిన డీఎస్‌వో

శంకరపట్నం, ఏప్రిల్ 15: మండలంలోని మొలంగూర్, తాడికల్ గ్రామాల్లోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను సోమవారం జిల్లా సివిల్ సప్లయ్ అధికారి గౌరిశంకర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు నాణ్యమైన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చి విక్రయించుకోవాలన్నారు. దళారులను నమ్మి మోసపోవద్దన్నారు. కార్యక్రమంలో సివిల్ సప్లయ్ డీటీ వేణుగోపాల్ పాల్గొన్నారు. అలాగే కన్నాపూర్ గ్రామంలో సీనియర్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, మెట్‌పల్లి సీఈవో సదయ్యలు ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించారు.

రైతులకు రుణమాఫీ, బోనస్ ఇచ్చిన తర్వాతనే ఓట్లు అడగాలి



హుజూరాబాద్‌లో ఇంటింటి ప్రచారం



చిగురుమామిడిలో ప్రచారం



గంగాధరలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే శోభ

హుజూరాబాద్, ఏప్రిల్ 15: రైతులకు రూ. 2లక్షల రుణమాఫీ, క్వింటాల్ ధాన్యానికి రూ. 500బోనస్ ఇచ్చిన తర్వాతనే ఈ పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఓట్లు అడగాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి అన్నారు. సోమవారం హుజూరాబాద్ పట్టణంలో విజయ సంకల్ప అభియాన్ కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి తిరుగుతూ విస్తృత ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతి ఇంటికి వెళ్లి సంకల్ప పత్రం అందించి, స్టిక్కర్లను అంటించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా ప్రజలందరూ బీజేపీ మోదీ ప్రభుత్వంపై విశ్వాసం, నమ్మకంతో ఉన్నారన్నారు. అందుకే వరుసగా మూడోసారి కూడా కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వస్తుందన్నారు. అలాగే కరీంనగర్ పార్లమెంట్ సభ్యుడు బండి సంజయ్ కుమార్ భారీ మెజార్టీతో గెలవబోతున్నారన్నారు. కార్యక్రమంలో గంగిశెట్టి రాజు, నిర్మలారెడ్డి, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

● ఇల్లందకుంట: మండలంలోని కనగర్తి గ్రామంలో బీజేపీ సీనియర్ నాయకుడు మట్ట పవన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఇంటింటికి బీజేపీ కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పదేళ్లలో బీజేపీ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించారు. మరో పదేళ్ల కేంద్రంలో మోదీ ప్రభుత్వం వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. కరీంనగర్ బీజేపీ పార్లమెంట్ అభ్యర్థి బండి సంజయ్‌కుమార్‌ను అధిక మెజార్టీతో గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. కార్యక్రమంలో సతీష్, బాల్‌రెడ్డి, రాజు, తిరుపతి, సంపత్, రాజమహేందర్, సాంబయ్య, సుధాకర్, భాస్కర్, సతీష్, సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

● చిగురుమామిడి రాబోయే లోక్‌సభ ఎన్నికల్లో కరీంనగర్ బీజేపీ అభ్యర్థి బండి సంజయ్‌కుమార్‌ను మరోమారు ఎంపీగా అత్యధిక మెజార్టీతో గెలిపించాలని చిగురుమామిడి మండలంలోని అన్ని గ్రామాల్లో మండల అధ్యక్షుడు పైడిపెల్లి శ్రీనివాస్ ఆధ్వర్యంలో కార్యకర్తలు, నాయకులు సోమవారం గడపగడపకు ప్రచారం నిర్వహించారు. ఈ ప్రచార కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, హుస్నాబాద్ నియోజక వర్గ కో ఆర్డినేటర్ కోమటిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి, బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యుడు చెప్యాల మురళి మనోహర్, జిల్లా అధికార ప్రతినిధి పొన్నం శ్రీనివాస్, పోలోజు సంతోష్, మాజీ అధ్యక్షుడు పైడిపల్లి అంజయ్య, ఓబిసి మోర్చా మండల అధ్యక్షుడు గర్దాస్ సతీష్, ముంజ చంద్రయ్య, మండల ఉపాధ్యక్షులు కంది శంకర్, రఘునాథచారి, పడాల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

● చొప్పదండి : చొప్పదండిలో బీజేపీ బూత్ అధ్యక్షుల ఆధ్వర్యంలో అభివృద్ధి పనులపై ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు చేపూరి సత్యనారాయణ, బత్తిని ప్రశాంత్, రాజన్నల రాజు, చిల్ల శ్రావణ్, చల్ల అనూష్, స్వర్గం కళ్యాణ్, జిట్ట కుమార్, అనుకారి సాయికృష్ణ, గుర్రం సమరసింహారెడ్డి, తాడూరి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

● జమ్మికుంట రూరల్: జమ్మికుంట పట్టణంలో కరీంనగర్ పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి బండి సంజయ్‌కుమార్‌కు మద్దతుగా నాయకులు సోమవారం ఇంటింటి ప్రచారం చేపట్టారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు ఎరబెల్లి సంపత్‌రావు, జీడి మల్లేష్, శీలం శ్రీనివాస్, ఆకుల రాజేందర్, కర్రె సంజీవరెడ్డి, లింగంపల్లి శంకర్, పుప్పాల రఘు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

● హుజూరాబాద్‌రూరల్: మండలంలోని రంగాపూర్ గ్రామంలో కరీంనగర్ బీజేపీ ఎంపీ అభ్యర్థి బండి సంజయ్‌కుమార్ ఓటేసి గెలిపించాలని కోరుతూ సోమవారం బీజేపీ నాయకులు ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ సీనియర్ నాయకులు బింగి కరుణాకర్ కేంద్ర ప్రభుత్వ పథకాల గురించి ప్రజలకు వివరించారు.

● గంగాధర: అధికార పార్టీ కాంగ్రెస్‌కు కరీంనగర్‌లో అభ్యర్థి కరువైందని మాజీ ఎమ్మెల్యే బొడిగె శోభ అన్నారు. సోమవారం బండి సంజయ్ కుమార్ గెలుపు కోసం గంగాధర మండలం మధు రానగర్‌లో గడప గడపకు నరేంద్ర మోదీ అభివృద్ధి కరపత్రాలను పంపిణీ చేస్తూ ప్రచారం నిర్వహించారు. కేంద్రంలో రెండు మార్లు అధికారం చేపట్టి అవినీతి లేని పాలనతో అభివృద్ధి సాధించారన్నారు. పార్లమెంటు ఎన్నికల్లో ఎంపి బండి సంజయ్ గెలుపుకోసం కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ పెరుక శ్రవణ్‌కుమార్, జిల్లా నాయకుడు వైద రామానుజం, అశోక్, తూం నారాయణ, వొడ్నాల రాజు, ప్రభాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అన్నారంలో పోలీసుల కవాతు

మానకొండూరు, ఏప్రిల్ 14: మండలంలోని అన్నారం గ్రామంలో సోమవారం కేంద్ర బలగాలతో పోలీసులు కవాతు నిర్వహించారు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో గ్రామాలలో ఏలాంటి అవాంచనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా మానకొండూర్ సీఐ రాజ్‌కుమార్ ఆధ్వర్యంలో గ్రామంలోని ప్రధాన కూడలీలో కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా ప్రజలు సహకరించాలని కోరారు. ఈ కవాతులో సుమారు 100 మంది కేంద్ర బలగాల సిబ్బంది, స్థానిక పోలీసులు పాల్గొన్నారు.

జువ్వాడి మధుసూదన్‌రావు సేవలు మరువలేనివి

తిమ్మాపూర్, ఏప్రిల్15: ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధులు, జిల్లా స్వాతంత్ర్య సమరయోధుల ట్రస్ట్ ఉపాధ్యక్షులు జువ్వాడి మధుసూదన్‌రావు సమాజానికి చేసిన సేవలు మరవలేనివని జిల్లా స్వాతంత్ర్య సమరయోధుల ట్రస్ట్ ఛైర్మన్, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి, మాజీ ఎంపీ బోయినిపల్లి వినోద్‌కుమార్ పేర్కొన్నారు. సోమవారం మండలంలోని ఎల్ఎండీ కాలనీలో గల జిల్లా స్వాతంత్ర్య సమరయోధుల ఆధ్వర్యంలో నడుస్తున్న మానసిక వికలాంగుల పాఠశాలలో దివంగత జువ్వాడి మదుసూధనరావు కుటుంబ సభ్యులు సంతాప సభ నిర్వహించగా కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. మధుసూదన్‌రావు 36సంవత్సరాల క్రితం సంస్థ స్థాపించినప్పటి నుంచి సేవలందిస్తూ మేనేజింగ్ ట్రస్టీగా సేవలందించారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో జువ్వాడి మధుసూదన్ రావు కుమార్తెలు జువ్వాడి శైలజ, జువ్వాడి పద్మజ ఇతర కుటుంబ సభ్యులు, సంస్థ ట్రస్టీ సముద్రాల జనార్ధన్, బోజ్జపురి వెంకటయ్య, కోమిరెల్లారెడ్డి గాజుల భగవాన్, జాప వెంకట రమణా రెడ్డి, సిపిఐ నేత మర్రి వెంకట స్వామి, ఏవో బాల్ రాజు, ప్రిన్సిపాల్ సతీష్, ఉపాధ్యాయులు, సిబ్బంది ఉన్నారు.

భవనం పై నుంచి పడి మహిళ మృతి

కరీంనగర్ క్రైం, ఏప్రిల్15: పద్మశాలి స్ట్రీట్‌లో రెండంతస్తుల భవనం పైనుంచి ప్రమాదవశాత్తు కాలుజారి కిందపడిన తివారి యశోద (43) తీవ్ర గాయాలతో ఆసుపత్రిలో చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మృతి చెందిందని పోలీసులు తెలిపారు. యశోద ఆమె తల్లి కలిసి ఎండుమిర్చి బ్యాగులను భవనం పైనుంచి కిందికి తీసుకొస్తుండగా మెట్ల పైన కాలుజారి కింద యశోదకు తలకు తీవ్ర గాయాలయ్యాయి తీఠోశీ అంబులెన్స్‌లో ఆమెను ఒక ప్రైవేట్ ఆసంత్రికి తరలించి చికిత్స చేయిస్తుండగా రాత్రి మృతి చెందిందని పోలీసులు తెలిపారు. యశోద పుట్టుకతో సరిగా నడవలేని సమస్యతో బాధపడుతుందని తెలిపారు. మృతురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని వన్ టౌన్ పోలీసులు తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

గణేశ్‌నగర్, ఏప్రిల్ 15 : నగరంలో కొత్త లైన్ల ఏర్పాటు, చెట్ల కొమ్మల తొలగింపులో భాగంగా మంగళవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12:30గంటల వరకు నగరంలో వివిధ ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు టౌన్ వన్ ఏడీఈ, సాయినేని నరేందర్, రూరల్ ఏడీఈ, కొలుపుల రాజులు తెలిపారు. గోదాంగడ్డ, సప్తగిరి కాలనీ, శ్రీనగర్ కాలనీ, భగత్‌నగర్, సివిల్ హాస్పిటల్ ఫీడర్ పరిధిలో జనని చికెన్ సెంటర్, గోపీకృష్ణ ఫంక్షనల్ హాల్ ఎదురుగా ఉన్న ప్రాంతం, వావిలాలపల్లిలో కొంత భాగం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు. రూరల్ ప్రాంతాలలో ఉదయం 8 నుంచి 11 గంటల వరకు టీజీపల్లి, చెంద్రపురి, ఆర్టీసీ కాలనీ, వడ్డెర కాలనీ, రెవెన్యూ కాలనీ, కేఆర్ కాలనీ, హ్యాపీ హోమ్స్ రాణిపూర్ రోడ్, పోచమ్మ దేవాలయం ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు.

ఇంట్లో గొడవపడి పారిపోయిన మహిళ

-కుటుంబ సభ్యులకు అప్పగించిన పోలీసులు

కరీంనగర్ క్రైం, ఏప్రిల్ 15: ఇంటిలో గొడవ పడి పారిపోయిన మహిళను పోలీసులు వెతికి కుటుంబసభ్యులకు అప్పగించారు. జగిత్యాల జిల్లా కోరుట్ల మండలం కిషన్ రావుపల్లికి చెందిన చిలువేరి రాజేశ్వరి(40) అనే మహిళ తన భర్తతో విడాకులు తీసుకొని ఇంటి వద్దనే ఉంటున్నది. ఈమెకు కొడుకు నితిన్(20) ఉన్నాడు. సోమవారం కొడుకు నితిన్‌తో గొడవపడిన రాజేశ్వరి ఇంటి నుంచి బయలుదేరి కరీంనగర్ బస్టాండ్ చేరుకుంది. నితిన్ తన తల్లికి ఫోన్ చేయగా తాను కరీంనగర్‌కు వచ్చానని, డ్యామ్‌లో దూకి చనిపోతానని ఫోన్‌లో తెలిపింది. ఆందోళనకు గురైన నితిన్ వెంటనే డయల్ 100కు ఫోన్ చేసి తన తల్లి వివరాలు తెలిపాడు. వెంటనే కరీంనగర్ వన్ టౌన్ బ్లూ కోల్ట్స్ పోలీసు సిబ్బంది ఎస్‌డి సర్వర్ అలీ, ఎ భాస్కర్ రంగంలోకి దిగి ఫోటోలు ఆధారంగా కరీంనగర్ బస్టాండ్ ఆవరణలో రాజేశ్వరిని గుర్తించారు. వెంటనే ఆమెకు తగిన కౌన్సిలింగ్ కోసం ఎస్ఐ స్వామి ముందు హాజరుపరిచారు. రాజేశ్వరి కొడుకు నితిన్‌ను రాణాకు పిలిపించి ఇద్దరికీ ఎస్ఐ స్వామి కౌన్సెలింగ్ ఇచ్చి కుటుంబ సభ్యులకు అప్పగించారు. మహిళను కేవలం 15 నిమిషాలలో ఆచూకీ కనిపెట్టి రక్షించిన పోలీసు సిబ్బందిని వన్‌టౌన్ సీఐ సరిలాల్ అభినందించారు.

నియామకం

కరీంనగర్ అర్బన్, ఏప్రిల్ 15: కాంగ్రెస్‌పార్టీ కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గానికి ఓబీసీసెల్ అదనపు బాధ్యులుగా జిల్లా కాంగ్రెస్ బీసీ సెల్ అధ్యక్షులైన పులి అంజనేయులుగౌడ్ నియమిస్తూ తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ బీసీ సెల్ అధ్యక్షులు నూతి శ్రీకాంత్ గౌడ్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా ఆంజనేయులుగౌడ్ మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థితో పాటు కాంగ్రెస్ పార్టీ పునర్నిర్మాణానికి పాటుపడతానని అన్నారు. తన నియామకానికి సహకరించిన నాయకులందరికి కృతజ్ఞతలు తెలిపారు.

న్యాయవాదులు స్వీట్ల పంపిణీ

కరీంనగర్ లీగల్, ఏప్రిల్ 15: తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటి లీగల్ హ్యూమన్ రైట్స్, ఆర్టిఐ ఛైర్మన్‌గా పొన్నం అశోక్‌గౌడ్ నియామకం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ జిల్లా కోర్టులోని కాంగ్రెస్ లీగల్‌సెల్ ఆధ్వర్యంలో స్వీట్లను పంపిణీ చేశారు. సోమవారం జరిగిన ఈకార్యక్రమంలో సీనియర్ న్యాయవాదులు ఆర్.దేవేందర్‌రెడ్డి, లుక్క రాజేశం, రాచకొండ ప్రభాకర్, పి.కుమారస్వామి, కె.లక్ష్మయ్య, బూడిద మల్లేశ్, బద్దం నర్సింహారెడ్డి, ప్రదీప్‌కుమార్, రాజు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ గెలుపు ఖాయం

● మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్

గంగాధర, ఏప్రిల్ 15: పార్లమెంటు ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్ గెలుపు ఖాయమైందని మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ అన్నారు. సోమవారం గంగాధరలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. కరీంనగర్‌ను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసిన బోయినపల్లి వినోద్‌కుమార్‌ను గెలిపించడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. ఆరు గ్యారంటీలతో గద్దెనెక్కిన కాంగ్రెస్ వాటిని అమలు చేయడంలో నిర్లక్ష్యం చేసిందన్నారు. ఎంపి బండి సంజయ్ కరీంనగర్‌కు నయాపైన అభివృద్ధికి తీసుకురాలేదన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు నవీన్‌రావు, గంగాధర సింగిల్ విండో అధ్యక్షుడు బాలగౌడ్ తదితరులు ఉన్నారు.

ఘనంగా ప్రపంచ కళా దినోత్సవం

జమ్మికుంట, ఏప్రిల్ 15: జమ్మికుంటకు చెందిన ప్రముఖ చిత్రకారుడు అంబాల ప్రభాకర్ ఆధ్వర్యంలో సోమవారం ఘణంగా ప్రపంచ కళా దినోత్సవం నిర్వహిం చారు. అంబాల ప్రభాకర్ తోటి కళాకారులను శాలువాలతో ఘణంగా సన్మానించారు. కార్యక్రమానికి మానవ హక్కుల వేదిక రాష్ట్ర ప్రధానకార్యదర్శి డాక్టర్ తిరుపతయ్య, జీడి సారయ్య, ఎస్ఆర్‌కె అధినేత మారుతి, దీకొండ రాజేందర్, భువనేశ్వర్, బ్రహ్మం, విశ్వకమల్, తదితరులు పాల్గొన్నారు.

19 నుంచి డిగ్రీ సెమిస్టర్ పరీక్షలు

హుజూరాబాద్‌రూరల్: ఈ నెల 19వ తేదీ నుంచి డిగ్రీ తృతీయ సంవత్సర విద్యార్థులకు ఆరో సెమిస్టర్ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు ఎస్‌యూ పరీక్షల నియంత్రణాధికారి ఆదేశాలు జారీ చేసినట్లు వీఎస్ఆర్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ హనుమకుమార్ ఒక ప్రకటనలో తెలిపారు.

చలివేంద్రం ప్రారంభం

శంకరపట్నం, ఏప్రిల్ 15: మండల కేంద్రంలో తాడికల్ వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రం కామన్ సర్వీస్ సెంటర్‌ను కేశవపట్నం కేడీసీసీ బ్యాంకు మేనేజర్ స్రవంతి ప్రారంభించారు.

ఘనంగా ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన

వీణవంక, ఏప్రిల్15: మండలంలోని కనపర్తి గ్రామంలో పురాతన శివాలయంలో సోమవారం ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని మహాకళ వంశీయులు రూ.18 లక్షల నిధులు సమకూర్చి ఆలయన్ని పునరుద్ధరించారు. పురోహితులు గూడ జగదీశ్వర శర్మ అధ్వర్యంలో రుత్వికులచే ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఆర్థికసాయం అందజేత

వీణవంకఏప్రిల్15: నర్సింగాపూర్ గ్రామానికి చెందిన మడ్డి శంకరయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా యూత్ కాంగ్రెస్ నాయకుడు మందాల అనీల్ అధ్వర్యంలో రూ.3,350ఆర్థికసాయం కుటుంబ సభ్యులకు అందించారు.

అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన

మానకొండూర్, ఏప్రిల్ 15 : అగ్నిమాపక వారోత్సవాలలో భాగంగా సోమవారం మానకొండూర్‌లో అగ్నిప్రమాద నివారణపై గ్రామస్థులకు అవగాహన కల్పించారు. మానకొండూర్ అగ్నిమాపక అధికారి బూదయ్య పాల్గొన్నారు.